## క్లుప్తంగా

### కట్టుదిట్టంగా కోడ్ అమలు



గోకులపాడు శిలాఫలకానికి మాస్క్ వేస్తున్న వీఆర్వో నూకరాజు

ఎస్.రాయవరం : మండలంలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు చేయడంలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఉన్న రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేసి ఫ్లెక్సీలు తొలగించారు. అభివృద్ధి పథకాలు ప్రారంభించిన శిలాఫలకాలపై రాజకీయ నాయకుల పేర్లు కనిపించకుండా పేపర్లు అతికిస్తూ వీఆర్వో నూకరాజు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు అనుమతులు లేకుండా సొంత భవనాలపై కూడా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, జెండాలు తొలగించాలని సూచించారు. తొలగించని పక్షంలో అభ్యర్థి ఖర్చులో ఇవన్నీ జమ అవుతాయని ఈవోపీఆర్డీ సత్యనారాయణ తెలిపారు.

### రాజకీయ పోస్టర్లు తొలగించండి



ఫ్లెక్సీలను పరిశీలిస్తున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ఎం.మన్మథరావు హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు గాని విగ్రహాలకు ముసుగులు లేకుండా ఉంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్ అమలు సక్రమంగా జరిగేలా సహకరించాలన్నారు. స్వచ్ఛందంగా ఫ్లెక్సీలు తీసివేయాలన్నారు.

### జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రవిశంకర్ నాయక్



బాధ్యతలు స్వీకరిస్తున్న రవిశంకర్ నాయక్

పాయకరావుపేట : పట్టణంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.రవిశంకర్ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కళాశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### గంగాలమ్మ తల్లి గుడికి రూ.20వేల విరాళం



గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న మూలపేట ఉప సర్పంచ్ దేవీచంద్ర

మునగపాక : మూలపేట గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి గంగాదేవిపేటకు చెందిన ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర సోమవారం రూ.20,116 నగదును విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా పలువురు దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారు. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

### 15 లీటర్ల సారాతో ఇద్దరు అరెస్టు

రావికమతం: సారా విక్రయిస్తున్న కిత్తంపేట గ్రామానికి చెందిన దాసరి అబ్బాయి, కాలనీకి చెందిన మొగ్గ చిన్నను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణ్ సోమవారం తెలిపారు. సారా విక్రయాలపై సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. నిందితుల నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.



# తొలిరోజు నో 'టెన్'షన్



నక్కపల్లిలో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

- ప్రశాంతంగా ప్రారంభమైన పరీక్షలు
- తనిఖీ చేసిన డిప్యూటీ డీఈవో



ఎస్.రాయవరం : కొరుప్రోలు పరీక్ష కేంద్రంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు



పాయకరావుపేట : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు



కోటవురట్ల : కె.వెంకటాపురం నుంచి పదో తరగతి పరీక్షలకు బస్‌లో వచ్చేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

నక్కపల్లి : పదో తరగతి పరీక్షలు తొలిరోజు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నక్కపల్లి పాఠశాలలో 196 మందికి 194 మంది, గురుకుల పాఠశాలలో 240 మందికి 194 మంది, జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 107 మందికి 92 మంది, వేంపాడు పాఠశాలలో 224 మందికి 210 మంది, గొడిచర్ల పాఠశాలలో 250 మందికి 238 మంది హాజరయ్యారని ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. తొలిరోజు మొత్తం 1017 మందికి 966 మంది తెలుగు పరీక్ష రాశారన్నారు. డిప్యూటీ డీఈవో అప్పారావు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారని తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. సెంటర్ల వద్ద తాగునీరు, విద్యుత్ సదుపాయం, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. సిటింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

**తొలిరోజు 11 మంది గైర్హాజరు**

ఎస్.రాయవరం : మండలంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా సాగాయి. ఎస్.రాయవరం, కొరుప్రోలు, పి.ధర్మవరం, దార్లపూడి, శ్రీఆదర్శ పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు నిర్ణీత సమయానికి పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, సబ్ సంటర్ సిబ్బందితో వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి బందోబస్తు నిర్వహించినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. తొలిరోజు పరీక్షకు 1067 రెగ్యులర్ విద్యార్థులు, 57 మంది ప్రయివేటు విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 11మంది పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవో మూర్తి తెలిపారు.

**ఎస్.రాయవరంలో ఓపెన్ టెన్త్ పరీక్షలు**

మండల కేంద్రంలో ఓపెన్ టెన్త్ పరీక్షలు సోమవారం మధ్యాహ్నం ప్రారంభం అయ్యాయి. మండలంలో ఏకైక కేంద్రంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 184 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 148 మంది హాజరైనట్టు పరీక్షల నిర్వాహణాధికారి సంపత్ తెలిపారు.

పాయకరావుపేట : టెన్త్ పరీక్షలకు మండలంలో గల ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గల 1722 మంది విద్యార్థులు హాజరయ్యారు. శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కనోన్సా ఇంగ్లిషు మీడియం పాఠశాల, చైతన్య టెక్నో, మండలంలో గల ఎస్.నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాల్తేరులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు పరీక్ష ప్రశంతంగా జరిగింది. విద్యార్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు హాజరయ్యారు.

కోటవురట్ల: మండలంలో ఐదు హైస్కూల్స్, 1 కేజీబీవీ నుంచి విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరయ్యారు. పాములవాక జెడ్పీ హైస్కూల్ నుంచి 100, కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ నుంచి 70, జల్లూరు జెడ్పీ హైస్కూల్ నుంచి 58, కోటవురట్ల జెడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి 94, కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 111, కేజీబీవీ నుంచి 36 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కొడవటిపూడి, కె.వెంకటాపురం గ్రామాలకు చెందిన విద్యార్థులు కోటవురట్లలోని పరీక్ష కేంద్రానికి రావడానికి ఈ ఏడాది నుంచి ఆర్టీసీ బస్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా బీసీ అధ్యక్షుడు పైల రమేష్ అభ్యర్థన మేరకు సోమవారం ప్రత్యేక ఆర్టీసీ బస్‌లో విద్యార్థులను కోటవురట్ల తరలించారు. దాంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మునగపాక : మండలంలో మునగపాక,నాగులాపల్లి,గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూళ్లతో పాటు స్థానిక ప్రగతి పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు సుదూరంగా ఉన్న విద్యార్థులు ఆటోలపై వచ్చారు. ఎస్ఐ పి.ప్రసాదరావు గట్టి బందోబస్తు నిర్వహించారు.

రాంబిల్లి: మండలంలో రాంబిల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రవీంద్ర స్కూల్, పంచదార్ల ఉన్నత పాఠశాల, దిమిలి ఉన్నత పాఠశాల కేంద్రాల్లో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ నాలుగు పరీక్ష కేంద్రాల్లో 607 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుండగా తొలిరోజు రాంబిల్లి ఉన్నత పాఠశాల కేంద్రంలో ఒకరు, దిమిలి ఉన్నత పాఠశాల కేంద్రంలో ఒకరు, రాంబిల్లి రవీంద్ర స్కూల్ కేంద్రంలో ఒకరు మొత్తం ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో ఎం. సూర్యారావు తెలిపారు.

యలమంచిలి రూరల్ : పదో తరగతి వార్షిక పబ్లిక్ పరీక్షలు సోమవారం పట్టణంలోని తులసీనగర్ జెడ్పీ బాలికోన్నత పాఠశాల,కొత్తపేట జెడ్పీ హైస్కూల్, సెయింట్ మేరీస్, శ్రీచైతన్య స్కూళ్లలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్ష జరిగినట్టు ఎంఈవో వై.మీనాక్షి తెలిపారు. పరీక్ష కేంద్రాలకు వచ్చిన విద్యార్థులను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలకు పంపించారు. తొలిరోజు తెలుగు లాంగ్వేజి పరీక్ష నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ జరగకుండా పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు చూశారు.



మునగపాక : పరీక్షకు హాజరైన విద్యార్థులకు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతున్న ఎస్ఐ ప్రసాదరావు



రాంబిల్లి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం



యలమంచిలి కొత్తపేట జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ పాపినాయుడు

## మండలాలకు ఏఆర్వోల నియామకం

సాక్షి, అనకాపల్లి: అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మండలానికి ఒక సహాయ రిటర్నింగ్ అధికారి (ఏఆర్వో)ని నియమించారు. తహసీల్దార్లు ఆయా మండలాలకు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

**యలమంచిలి నియోజకవర్గం**

రాంబిల్లి-బి.అప్పలస్వామి(9492930842)
మునగపాక-బి.పాపారావు(9440275246)
అచ్యుతాపురం-పి.సరోజిని(8333988778)
యలమంచిలి- ఆర్.అప్పలరాజు(8333988764)

**పాయకరావుపేట నియోజకవర్గం**

కోటవురట్ల-బి.వెంకటరామన్(8985646123)
నక్కపల్లి-ఎం.శ్రీకాంత్(9440730019)
పాయకరావుపేట-జి.ఎ సూర్యనారాయణ(9177454585)
ఎస్.రాయవరం-జయలక్ష్మి(9177454585)

## 'కోడ్' అమలులో బాధ్యతగా ఉండాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌వో గీతాంజలి

నక్కపల్లి : ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రభుత్వ శాఖల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని పాయకరావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గీతాంజలి అన్నారు. సోమవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు చేయడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రకటనల బోర్డులు తొలగించాలన్నారు. ఎవరైనా తొలగించకపోతే సిబ్బంది తొలగించి దాని ఖర్చు అభ్యర్థి ఖాతాలో జమ చేయాలన్నారు. నియోజకవర్గంలో అభ్యర్థుల ప్రచార వాహనాలకు కూడా ముందుగా ఆర్‌వో అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి పొందిన ప్రకటన బోర్డులు ప్రదర్శించినపుడు ఎదుటవారి గౌరవానికి భంగం లేకుండా ఉండాలన్నారు. ఎన్నికల బహిరంగ సభలకు అనుమతి ఉండాలన్నారు. పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల పరిధిలో ఎటువంటి రాజకీయ బోర్డులు ఏర్పాటు చేయరాదన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, చెక్ పోస్టుల తనిఖీ బృందాలు, సెక్టోరల్ అధికారులు వీటిపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్, డీటీ చైనులు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



మానసిక ఆరోగ్యం పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

పాయకరావుపేట : మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు సమిద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సమిద సంస్థ కార్యదర్శి డి.వీరభద్రరావు తెలిపారు. పట్టణంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 250 మంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆదిత్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల రోజులుగా 3 జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంతవరకు 60 క్యాంపులు నిర్వహించి 4350 మంది విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. సమిద సంస్థ రిసోర్సు పర్సన్, పబ్లిక్ హెల్త్‌లో అనుభవం కలిగిన వైద్యులు జి.డి. గోయెంకాతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## ఎన్నికల విధులకు ప్రణాళిక



సచివాలయ ఉద్యోగులకు సూచనలిస్తున్న ఆర్వో మనోరమ

యలమంచిలి రూరల్: సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ప్రణాళిక సిద్ధం చేశామని,ఆ ప్రకారం సచివాలయ ఉద్యోగులంతా విధులు నిర్వర్తించాలని ఆర్వో కె.మనోరమ సూచించారు.సోమవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సచివాలయ ఉద్యోగులతో ఆమె ఎన్నికల సన్నద్ధతా సమావేశం నిర్వహించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయడానికి మీరంతా సహకరించాలన్నారు. వార్డులు,గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు సచివాలయ ఉద్యోగులు అధికారులకు తోడ్పాటునందించాలని కోరారు.సీ-విజిల్, ఎన్నికల్లో రాజకీయపార్టీల నాయకుల ఖర్చులు,ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా చేపట్టే కార్యకలాపాలపై తమకు సమాచారం అందించాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఓటర్లంతా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## 'యువత ప్రభుత్వ సహకారంతో ఎదగాలి'



విద్యార్థులతో స్వావలంబి భారత్ ప్రతినిధులు

అనకాపల్లి: యువత స్వయం కృషితో పాటు ప్రభుత్వ సహకారాన్ని వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని స్వావలంబి భారత్ అభియాన్ జోనల్ ఇన్‌చార్జి అగ్గాల హనుమంతరావు సూచించారు. స్థానిక హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులతో స్వావలంబి భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. స్వావలంబి భారత్ వలంటీర్ వెలగా జగన్నాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ యువత పారిశ్రామిక రంగంలో ఎదిగేందుకు అద్భుత అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకుని వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా రాణించాలన్నారు. ప్రపంచంలో భారత్ 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు తోడ్పడాలని కోరారు. ఈ సందర్భంగా స్వావలంబి భారత్ విశాఖ కన్వీనర్, యువ పారిశ్రామికవేత్త ముత్యాల నాయుడు విద్యార్థులతో ముచ్చటించారు. ఆయన మొబైల్ ఆక్సిసర్వీస్ సంస్థను ఏ విధంగా స్థాపించి, 20 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారో వివరించారు. బ్యాంకు రుణాల అనుసంధానకర్త పారుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ హామీ అవసరం లేని రుణాల గురించి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కొణతాల జనార్దన్, ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మోపెడ్ చోరీపై కేసు నమోదు

యలమంచిలి రూరల్ : యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోపెడ్ చోరీపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పైల సింహాచలం సోమవారం రాత్రి మీడియాకు తెలిపారు. నక్కపల్లి మండలం సారిపల్లిపాలె గ్రామానికి చెందిన లోవరాజు అలియాస్ బాడిదం కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్నాడు. ఈ నెల 12వ తేదీన మండలంలోని పులపర్తి గ్రామం వద్ద తన మోపెడ్‌ను రోడ్డు పక్కన నిలిపి కొబ్బరి చెట్లు ఎక్కి కాయల బస్తాలతో అక్కడకు వచ్చేసరికి నిలిపి ఉంచిన మోపెడ్ కనిపించలేదు. ఎంత వెతికినా కనిపించక పోవడంతో సోమవారం యలమంచిలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

## ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



ఉత్సవాల్లో ఆకట్టుకున్న కోలాటం

మునగపాక : మండల కేంద్రంలోని పల్లపు వీధిలో వినాయక ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి వినాయకుని దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. వినాయక దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో అదే రోజు రాత్రి ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

## అవగాహనతో క్షయ నియంత్రణ



పట్టణంలో ర్యాలీ చేస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

అనకాపల్లి: క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతి ఒక్కరూ చైతన్యం కలిగి ఉండాలని గొల్లవీధి యూపీహెచ్‌సీ వైద్యాధికారి జీకే నాగేంద్ర అన్నారు. క్షయవ్యాధి వారోత్సవాల్లో భాగంగా స్థానిక యూపీహెచ్‌సీ నుంచి కోట్నివీధి వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో క్షయవ్యాధి ఎలాంటి వయో, లింగ తారతమ్యం లేకుండా ఏటా కొన్ని లక్షల మందిని ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే మన దేశంలోలో వ్యాధి గ్రస్తులు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. గాలి తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాధి సోకుతుందన్నారు. ప్రభుత్వం క్షయ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందని, ఆరుమాసాలపాటు మందులు వాడితే వ్యాధి నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మరో వైద్యాధికారిణి ధాత్రీప్రియ, క్షయవ్యాధి అధికారి అయ్యప్ప రెడ్డి, కో ఆర్డినేటర్ ఎల్లాజీ, వైద్యసిబ్బంది ఎం.పెంటయ్య, ఎస్‌టీఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వహించాలి

- పక్కాగా ప్రవర్తనా నియమావళి అమలు
- అధికారులకు ఆర్వో, డీఎస్పీల సూచనలు



సూచనలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

యలమంచిలి రూరల్ : ఎన్నికల విధి నిర్వహణలో చిన్న పొరపాటు జరిగినా ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులంతా ఎలాంటి పొరపాట్లు, తప్పిదాలు, ఆరోపణలు, ఒత్తిళ్లు, విమర్శలకు తావివ్వకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మనోరమ, పరవాడ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ సూచించారు. సోమవారం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎంసీసీ టీం సభ్యులతో జరిగిన సమావేశంలో వారు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 16న భారత ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమల్లోకి వచ్చినందున అధికారులంతా అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్నారు. తొందరపాటుతో సొంత నిర్ణయాలు తీసుకోకుండా స్పష్టత లేని విషయాలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి వారికి దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల కోడ్ విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్), ఎస్ఎస్‌టీ (స్టాటిస్టికల్ సర్వైలెన్స్) బృందాలు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా నగదు, మద్యం వంటివి పంపిణీ చేయకుండా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయపార్టీల నాయకుల బ్యానర్లు, ఫోటోలు, పోస్టర్లు, స్టిక్కర్లు, జెండాలను తొలగించాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. కార్యక్రమంలో యలమంచిలి సీఐ షేక్ గఫూర్, నాలుగు మండలాల తహసీల్దార్లు, రాంబిల్లి, అచ్యుతాపురం సీఐలు, ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సౌజన్య తదితరులు



పోషకాహార పదార్థాల ప్రదర్శన

రాంబిల్లి : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని టాటా సంస్థ , ఏషియన్ పేయింట్స్ కో ఆర్డినేటర్ సౌజన్య అన్నారు. దిమిలి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం- ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ, ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు పలు రకాల పోషకాహార పదార్థాలను తీసుకువచ్చి వాటిని ప్రదర్శించారు. మంచి పోషకాహార పదార్థాలను ప్రదర్శించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు వరలక్ష్మి, సుజాత, పోషణ సఖిలు దుర్గ, నాగలక్ష్మి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

## దత్త క్షేత్రంలో నేడు, రేపు ఆధ్యాత్మిక శోభ

అనకాపల్లి: గ్రేటర్ విశాఖ విలీన గ్రామం సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో మంగళవారం నుంచి రెండు రోజులపాటు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు క్షేత్ర నిర్వాహకుడు ఆంజనేయరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం కార్యసిద్ధి ఆంజనేయస్వామికి బడబానల స్తోత్రం, హనుమాన్ మంత్రం, నాగవల్లీ దళార్చన, లాంగూలాస్త్ర స్తోత్రం, సింధూర అర్చన, 20న సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తామన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు క్షేత్రంలో సంప్రదించాలని కోరారు.

## 'యాదవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'

తుమ్మపాల: అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సుమారు 35 వేల ఓటు బ్యాంకు కలిగిన యాదవ సామాజిక వర్గానికి సముచిత రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోడి వెంకటరావు అన్నారు. పట్టణంలో గొల్లవీధి సీతారామ దేవాలయ ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి యాదవ సంక్షేమ సంఘం సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ సామాజిక భవన నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు తగు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే తమ సహకారం ఉంటుందన్నారు. సమావేశంలో పట్టణ యాదవ సంఘం అధ్యక్షుడు భరణికాన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పల్లా సత్యఅప్పారావు, ప్రధాన కార్యదర్శులు బొబ్బిలి గోవింద, గోకివాడ లోవకృష్ణ, గౌరవ అధ్యక్షుడు ఒమ్మి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నాట్‌లో కె.కోటపాడు విద్యార్థులకు ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనిధి దూళిపాల, పూర్వ వీసీ ముర్రు

కె.కోటపాడు: నేషనల్ ఎనలైటికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (నాట్)లో గ్రామీణ ప్రాంతానికి చెందిన అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ర్యాంకులు సాధించడం హర్షణీయమని అమెరికాలో న్యాయవాద వృత్తిలో అటార్నీగా పనిచేస్తున్న శ్రీనిధి దూళిపాల అన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రెండో దశ నాట్ ఫలితాల్లో అయ్యన్న పాఠశాల నుంచి 7వ తరగతి విద్యార్థులు చైతన్యరామ్, లక్ష్మీ లోహిత ప్రియ 8వ ర్యాంకును, మోహిత, తేజస్విని, 3వ తరగతి చదువుతున్న రెడ్డి మేఘన 12వ ర్యాంకు, 8వ తరగతి చదువుతున్న లెక్కల దినేష్ 13వ ర్యాంకు సాధించారు. వీరిని సోమవారం స్థానిక పాఠశాలలో శ్రీనిధి దూళిపాలతోపాటు పూర్వ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, అయ్యన్న విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఖాసిం అభినందించారు. ప్రతిభ పరీక్షలతో విద్యార్థుల్లో సామర్థ్యం బయట పడుతుందని ముత్యాలనాయుడు అన్నారు.